# క్రైమ్ కౌంటర్

webisite:www.crimecounter.in

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 151 ప్రకాశం, సోమవారం 02- 03 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైమ్ కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349



## ముఖ్య గమనిక

మీ వివాహాది శుభకార్యముల కొరకు మరియు మీ పెళ్లిరోజు, పుట్టినరోజు ప్రకటనల కొరకు మరియు మీ వ్యాపార ఇతర కార్యముల ప్రకటనల కొరకు మా పత్రికలో అతి తక్కువ ధరలో ప్రకటనలు వేయబడును.

ఇతర వివరముల కొరకు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## మిత్రులకు నమస్కారం,

సత్తెనపల్లి పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో పరివర్తన స్కూల్ ఎదురుగా ఉన్న క్రైమ్ కౌంటర్ దినపత్రిక రాష్ట్ర కార్యాలయం వద్ద క్రైమ్ కౌంటర్ దినపత్రిక యాజమాన్యం చేతచలివేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుంది. చలివేంద్రాన్ని మన MEF ఆధ్వర్యంలో 3/3/2026 మంగళవారం రోజున ఉదయం 9 గంటలకు MEF నాయకుల చేత ప్రారంభోత్సవం చేయబడుతుంది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా MEF పల్నాడు జిల్లా నాయకులు, సత్తెనపల్లి నాయకులు హాజరవుతున్నారు.

కావున ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయవలసినదిగా ఆహ్వానిస్తున్నాం.

ఇట్లు

శ్రీ కటికల వరప్రసాద్, స్టాఫ్,&మిత్ర బృందం...

సి. ఈ. ఓ.& ఎడిటర్

క్రైమ్ కౌంటర్ దినపత్రిక, సత్తెనపల్లి.ఆంధ్రప్రదేశ్

## లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో బైరెడ్డి, దారపనేని



**పామూరు, మార్చి 1, క్రైం కౌంటర్** ఆంధ్ర రాష్ట్ర రాజధాని అమరావతి పరిధిలోని ప్రసిద్ధి చెందిన మంగళగిరి లక్ష్మీనరసింహ స్వామిని ఆదివారం ప్రపంచ పౌర రక్షణ దినోత్సవం సందర్భంగా కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి దర్శించుకున్నారు. దేవస్థాన ప్రధాన అర్చకులతో, వేద పండితుల వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బైరెడ్డి, దారపనేని మాట్లాడుతూ లక్ష్మీనరసింహస్వామి దర్శనంతో సకల శుభాలు కలుగుతాయని, ఆరోగ్యవంతులుగా ఉంటారని, శత్రుశేషం తొలగిపోయి మిత్రుత్వానికి లక్ష్మీనరసింహస్వామి దోహదపడతారని భక్తులకు అపారమైన నమ్మకమని పేర్కొన్నారు. దేవస్థాన ప్రధాన అర్చకులు బైరెడ్డి దారపనేనీ లకు స్వామివారి పట్టు వస్త్రం బహుకరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## శ్మశానవాటిక అభివృద్ధి పనులు వేగవంతం


**క్రైం కౌంటర్ న్యూస్ :** మార్టూరు,మార్చి1 మండల పరిధిలో బొబ్బేపల్లి గ్రామంలో హిందూ స్మశాన వాటికలో నిర్మాణ పనులు చురుకుగా సాగతున్నాయి. అందుకు సంబందించి దహనవాటిక, వేచిఉండే గది, స్నానపుగదులు, దుస్తులు మార్చుకోవడానికి గది, తదితర ఏర్పాట్లు కోసం భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. గ్రామంలో హిందూ శ్మశానవాటిక 90 సెంట్లు స్థలం విస్తీర్ణంలో ఉంది. దీనిలో అని వసతులు నిర్మాణం కోసం గ్రామస్థుల కోరిక మేరకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రూ.18 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో పనులు వేగం పుంజుకున్నాయి. శ్మశానవాటిక చుట్టూ ప్రహరీగోడ, మెయిన్‌గేట్, గేట్‌పై ముఖద్వారం తదితర పనులు చేస్తున్నారు. గతంలో శ్మశానవాటిక వద్దకు వచ్చేవారు ముళ్లపొదలు, చెట్లుతో ఇబ్బందులు పడేవారు. వాటన్నింటిని శుభ్రం చేయించి, మంజూరైన నిధులతో శ్మశానంలో ఏర్పాట్లు



చేస్తున్నారు. అంతే గాకుండా శ్మాశానవాటికకు కొత్తగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించారు. ఇంకా నీటివసతి కూడా కల్పించారు. గ్రామ టీడీపీ నాయకులు తేలప్రోలు సాంబశివరావు, గుర్రం కోటేశ్వరరావు, మాలంపాటి మల్లయ్య, ఐలవరపు ఆంజనేయులు, గంగాధర సింగరకొండలు పనులను పర్యవేక్షిస్తున్నారు.

## చీమలదిన్నె వారి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న గంగసాని





**పామూరు, మార్చి 1, క్రైం కౌంటర్** పామూరు మండలం కొత్తపల్లి గ్రామంలో చీమలదిన్నె మల్లికార్జున బి లక్ష్మీ కుమారి వారి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని వారి ఇంట సిరిసంపదలు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పామూరు మండల జడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, గట్ల విజయభాస్కర్ రెడ్డి, షేక్ చాంద్ బాషా (బుజ్జి,) శ్రీ రామ్ శ్రీను, ఆవుల రామకృష్ణ, చీమలదిన్నె రమణయ్య, బూసరాజు హరీష్ ,రాచకొండ మహేంద్ర , మన్నెం మాధవ, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు పెనుమల్ల కిషోర్, నీలం వెంకటేశ్వర్లు ,రాచకొండ మధు, ధూపాటి నారాయణ, వేంపాటి నారాయణ, రావుల మధు, చీమలదిన్నె వెంగయ్య, పామూరు మండల నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థుల నుంచి వసూలుచేస్తున్న కాలేజీ యాజమాన్యాలు

### ప్రభుత్వం నిధులు విడుదల చేసినా ఇబ్బందులు

### నిధులు జమ కాకపోవడంతో ఒత్తిడి




**క్రైం కౌంటర్ న్యూస్ :** విశాఖపట్నం, మార్చి 1 జిల్లాలో ఉన్నత విద్యా కోర్సులు చదువుతున్న విద్యార్థులను ఫీజులు పరేషాన్‌కు గురిచేస్తున్నాయి. ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చేయకపోవడతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం సుమారు ఏడు క్వార్టర్ల ఫీజులను పెండింగ్‌లో పెట్టడంతో 2022–23, 2023–24 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, ఐటీఐ కోర్సుల్లో చేరిన విద్యార్థుల తల్లిదండ్రులే చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పెండింగ్ ఫీజుల బాధ్యత కూడా కూటమి ప్రభుత్వంపై పడింది.

ఈ నేపథ్యంలో బకాయిలు చెల్లించేందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కొద్దిరోజులు కిందట రూ.1,200 కోట్లు విడుదల చేసింది. అయితే వారం రోజులు గడిచినా ఇప్పటికీ కాలేజీ ఖాతాలకు డబ్బు జమ కాలేదని, ఈ నేపథ్యంలో విద్యార్థులే చెల్లించాలని యాజమాన్యాలు వేధిస్తున్నాయి. మరోవైపు అధికారులు మాత్రం ప్రభుత్వం విడుదల చేసిన నిధులు కాలేజీ ఖాతాలకు జమ అవుతున్నాయని చెబుతున్నారు.

తప్పని ఇబ్బందులు.. గత ప్రభుత్వం విద్యార్థుల ఖాతాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ మొత్తాలను చెల్లించేది. దీనివల్ల ప్రభుత్వం చెల్లించినా, చెల్లించకపోయినా విద్యార్థులు తప్పనిసరిగా ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడేది. ఆ విధానం వల్ల వైసీపీ హయాంలో వేలాది మంది విద్యార్థులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం పూర్వ విధానాన్ని అమలుచేయడంతో కళాశాలల ఖాతాలకే నిధులు జమవుతాయి. దీంతో ఫీజుల బాధ తప్పుతుందని విద్యార్థులు భావించారు. ఈ నేపథ్యంలో ఫీజుల విషయమై యాజమాన్యాలు ప్రభుత్వంతో చర్చించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యార్థులను ఒత్తిడి చేయకూడదని అధికారులు హెచ్చరించారు. అయినప్పటికీ అనేక కాలేజీల యాజమాన్యాలు ఫీజుల పేరుతో విద్యార్థులను వేధిస్తున్నాయి. లేదంటే పరీక్షలకు హాజరుకానీయబోమంటూ హెచ్చరిస్తున్నాయి. దీంతో విద్యార్థులు విడతలు వారీగా ఫీజులు చెల్లిస్తున్నారు. ఇప్పటికే గడిచిన విద్యా సంవత్సరం, ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజులను ఎంతో మంది విద్యార్థులు చెల్లించారు. ప్రభుత్వం నుంచి జమ అయిన తరువాత తమ డబ్బులు వెనక్కి ఇస్తారా.? అన్న ప్రశ్నలకు కాలేజీ యాజమాన్యాలు సమాధానం చెప్పడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

ఇదీ లెక్క.. జిల్లాలో డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, ఐటీ వంటి కోర్సులు చదువుతున్న విద్యార్థులు సుమారు 80 వేల మంది వరకు ఉంటారు. వీరికి ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఏటా ప్రభుత్వం సుమారు రూ.70 నుంచి రూ.80 కోట్ల వరకు చెల్లిస్తుంది. గడిచిన కొన్ని క్వార్టర్లకు సంబంధించిన ఫీజులు విడుదల చేయకపోవడంతో బకాయిల భారం విద్యార్థులపై పడుతోంది.ప్రభుత్వ పరిధిలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను విద్యాశాఖ వెబ్‌సైట్, విద్యాశాఖ కార్యాలయం నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ తెలిపారు. ఇప్పటికే వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని జాబితా రూపొందించామని వెల్లడించారు. జాబితాపై అభ్యంతరాలను ఈనెల ఏడోతేదీలోగా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.చంద్ర గ్రహణం సందర్భంగా మంగళవారం జిల్లాలోని ప్రధాన ఆలయాలన్నీ మూతపడనున్నాయి. సింహాచలంలోని వరాహలక్ష్మీ నృసింహస్వామి ఆలయాన్ని ఉదయం 8 గంటలకే కవాట బంధనం చేస్తామని, భక్తులకు దర్శనాలు లభించవని ఈవో వెంకటరావు తెలిపారు. సంపత్ వినాయగర్ ఆలయం, ఇసుక కొండ సత్యనారాయణస్వామి ఆలయాల్లో మంగళవారం ఉదయం 11 గంటల వరకు భక్తుల దర్శనాలకు అనుమతిస్తామని, అనంతరం మూసివేసి, తిరిగి బుధవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం దర్శనాలకు అనుమతిస్తామని అధికారులు వివరించారు. కాగా కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని ఉదయం 11 నుంచి రాత్రి 8.30 గంటల వరకు మూసివేసి, సంప్రోక్షణ అనంతరం మంగళవారం రాత్రి దర్శనాలకు అనుమతిస్తామన్నారు.

# గల్ఫ్ దేశాల్లో మనోళ్లు.. యుద్ధం ముదిరితే సమస్యే




**స్వగ్రామాల్లోని తల్లిదండ్రులు, బంధువుల్లో ఆందోళన**

- విమానాల రద్దుతో నిలిచిపోయిన రాకపోకలు
- దుబాయ్‌లో పేలుళ్లతో దయాకర్ కుటుంబంలో ఆగిన అన్నప్రాసన
- ఉప్పులూరు నుంచి వెళ్లాల్సిన కుటుంబ సభ్యుల ప్రయాణం వాయిదా
- జెడ్డాలో కొండపల్లికి చెందిన హసీనా కుటుంబం నివాసం
- దాడులు జరుగుతున్న ప్రాంతానికి దగ్గరలోనే..
- బహ్రెయిన్‌లో వల్లభనేని ప్రవీణ్ కుటుంబం
- సమీపంలోని బే స్ క్యాంప్‌పై దాడి

**ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లోని మన తెలుగు ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వారి యోగక్షేమాలు ఎప్పటికప్పుడు తెలుసుకొంటూ స్వగ్రామాల్లోని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నాయి. ఇరాన్ ప్రతిదాడులతో గల్ఫ్ దేశాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.**

క్రైం కౌంటర్ న్యూస్ : విజయవాడ /ఇబ్రహీంపట్నం): దుబాయ్, షార్జా, అబుదాబి, బహ్రెయిన్ తదితర దేశాలలో ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి వందల సంఖ్యలో తెలుగు కుటుంబాలు నివశిస్తున్నాయి. ప్రస్తుత యుద్ధ మేఘాల నేపథ్యంలో ఎప్పుడేం జరుగుతుందా అన్న ఆందోళన నెలకొంది. దుబాయ్‌లో భారీ పేలుళు సంభవించడంతో అక్కడ ఉన్న మన తెలుగు ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. యూఎస్, ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా ఇరాన్ గల్ఫ్ దేశాలపై దాడులకు తెగబడటంతో గల్ఫ్ దేశాల్లో ఉన్న మనవాళ్లకు ఏమైనా అవుతుందని ఇక్కడ వారి కుటుంబ సభ్యులు కన్నీరు పెడుతున్నారు.

అన్నప్రాసనకు వెళ్దామనుకుంటే..

కృష్ణాజిల్లా కంకిపాడు మండలం ఉప్పులూరు గ్రామానికి చెందిన ఉడతా వెంకటేశ్వరరావు (కొండ) కుమారుడు దయాకర్, కోడలు దీప్తి దంపతుల దుబాయ్‌లోని కరామా ప్రాంతంలో నివశిస్తున్నారు. దయాకర్ షార్జాలో హార్డ్‌వేర్ రంగంలో పనిచేస్తున్నాడు. ఇటీవల ఈ దంపతులకు కుమారుడు జన్మించాడు. ఈ నెల 11వ తేదీన అన్న ప్రాసన కార్యక్రమాన్ని తలపెట్టారు. ఉప్పులూరు గ్రామం నుంచి తండ్రి కొండ, సోదరి సునీత ఈ నెల 3వ తేదీన దుబాయ్ వెళ్లటానికి ప్లాన్ చేసుకున్నారు. షార్జా విమాన సర్వీసు రద్దు కారణంగా వారు అక్కడికి వెళ్లలేకపోతున్నారు. దుబాయ్‌లో పేలుళ్లు సంభవిస్తుండటంతో.. దయాకర్, దీప్తి దంపతులు ఆందోళన చెందుతున్నారు. యుద్ధ మేఘాలతో తమ కొడుకు, కోడలు, మనవడి పరిస్థితి ఏమిటోనని తండ్రి కొండ, సోదరి సునీత ఆందోళన చెందుతున్నారు. దయాకర్ తండ్రి, కుటుంబ సభ్యులు ఫోన్లు చేస్తూ వారి యోగక్షేమాల గురించి తెలుసుకుంటున్నారు. తమ గురించి ఆందోళన చెందవద్దని తండ్రి, సోదరికి దయాకర్, దీప్తి దంపతులు ధైర్యం చెబుతున్నారు.

జెడ్డాలో ఆంధ్రా ముస్లిం కుటుంబం

సౌదీ అరేబియాలోని జెడ్డా అనే ప్రాంతంలో ఎన్టీఆర్ జిల్లా (కొండపల్లి), ఏలూరు ప్రాంతానికి చెందిన డాక్టర్ ఎండీ జహంగీర్ పాషా- హసీనా జహంగీర్ కుటుంబం ఉంది. ప్రస్తుతం యూఎస్ క్యాంప్ బేసిన్‌పై ఇరాన్ దాడి చేస్తున్న ప్రాంతానికి వీరు కేవలం 500 కిలో మీటర్ల దూరంలో ఉన్నారని వారి బంధువులు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లికి చెందిన హసీనా జహంగీర్‌తో జహంగీర్ పాషాకు 30 ఏళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరు వివాహం అనంతరం జెడ్డాలో స్థిరపడ్డారు. వీరికి ముగ్గురు సంతానం. ఇద్దరు ఆస్ట?ట్రలియాలో ఉ ంటున్నారు. ఒక బాబుతో కలిసి వీరు ప్రస్తుతం జెడ్డాలో ఉన్నారని ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి మున్సిపాలిటీకి చెందిన హసీనా జహంగీర్ సోదరుడు ఆలి హైదర్ తెలిపారు. ఐఎంవో కాల్ ద్వారా మేము సేఫ్ అని రెండు మాటలు మాట్లాడిన తర్వాత వారి కాల్ కట్ అవుతుందని ఆలి హైదర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. జూఫర్ ప్రాంతంలో గుడ్లవల్లేరుకు చెందిన కుటుంబం కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు గ్రామానికి చెందిన వల్లభనేని ప్రవీణ్ కుటుంబం బహ్రెయిన్ రాజధాని మనామాలోని జూఫర్ ప్రాంతంలో నివసిస్తోంది. ఇది ఇరాన్ దాడి చేసిన యూఎస్ నేవీ బేస్‌కు పది కిలోమీటర్ల దూరంలో ఉంది. టీడీపీ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన వల్లభనేని బాబూరావు సోదరుడైన వల్లభనేని సత్యనారాయణ కుమారుడు వల్లభనేని ప్రవీణ్. బహ్రెయిన్ దేశంలో ఎస్కలేటర్స్ కంపెనీలో సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయన కుటుంబం జూఫర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివశిస్తోంది. గత పది రోజులుగా ఆ దేశ ప్రభుత్వ అధికారులు స్థానికంగా ప్రజలను ఈ తరహా దాడులు ఉండవచ్చని అప్రమత్తం చేస్తోందని ప్రవీణ్ శనివారం 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. దాడులు తీవ్రతరం కావటంతో వల్లభనేని సత్యనారాయణ కుటుంబం ఆందోళన చెందుతోంది. ప్రవీణ్‌కు ఫోన్ చేసి ఎప్పటికప్పుడు యోగక్షేమాలు తెలుసుకుంటున్నారు. అంతగా భయపడాల్సిన అవసరం లేదని ఆయన చెబుతున్నా.. ఏదో కొంత ఆందోళన కూడా ఆయన స్వరంలో కనిపిస్తోంది. భారత ప్రభుత్వం అవసరమైన పక్షంలో తమను ఇండియాకు తీసుకువచ్చేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు.

# బిక్కుబిక్కుమంటూ!

**గల్ఫ్ దేశాల్లో ప్రవాసీయుల ఆందోళన**
**ఇరాన్ దాడులతో భయం భయం**
**ఖతార్, దుబాయ్, కువైట్‌లో జిల్లా వాసులు**
**బాంబుల మోతతో ప్రవాసుల్లో తీవ్ర ఆందోళన**
**బయటకు వెళ్లొద్దని ఆయా దేశాల ప్రభుత్వాల సూచన**



క్రైం కౌంటర్ న్యూస్ :విశాఖపట్నం, మార్చి 1 ఇరాన్‌పై అమెరికా దాడితో గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇజ్రాయెల్, అమెరికా దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మృతి చెందడంతో ప్రతిగా ఇరాన్ భారీ దాడులకు దిగింది. అమెరికా బేస్ క్యాంపులు, మిత్రదేశాలపై ఇరాన్ మిసైల్స్‌తో విరుచుకుపడుతోంది. ఇప్పటికే దోహా, బెహ్రాయిన్, ఖతార్, యూఏఈ, కువైట్, జోర్డాన్, దుబాయ్ తదితర దేశాల్లోని అమెరికా బేస్ క్యాంపులపై ఇరాన్ దాడులు చేస్తుండడంతో ఆయా ప్రాంతాల్లో ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం వెళ్లిన జిల్లా వాసులు భయాందోళనతో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు.

దాడులతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియడం లేదని జిల్లా కు చెందిన పలువురు 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్‌లో వివరించారు. ఇల్లు వదిలి బయటకు రావద్దన్న ప్రభుత్వాల సూచనలు పాటిస్తున్నామన్నారు. ఖతార్‌లో ఉద్యోగులకు ఆయా కంపెనాలు వర్క్‌ఫ్రమ్ హోమ్ అవకాశాన్ని ఇవ్వగా, పది, ఇంటర్ విద్యార్థులకు జరుగు తున్న సీబీఎస్‌సీ పరీక్షలను అక్కడి ప్రభుత్వం వాయిదా వేసినట్టు తెలిపారు.

పరిస్థితులపై ఆరా

ఆయా దేశాల్లో పరిస్థితులపై తెలుగుదేశం పార్టీ విశాఖ సీని యర్ నాయకుడు వి.మూర్తియాదవ్ ఎన్ఆర్ఐ వ్యవహారాలశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఎవరూ కంగా రు పడాల్సిన అవసరం లేదని, నిత్యం సమీక్షిస్తున్నామని మంత్రి చెప్పారన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఆయా దేశాల్లో నెలకొన్న పరిస్థితులపై సమీక్షిస్తోందని, ప్రవాసుల భద్రతకు చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి హామీ ఇచ్చారన్నారు. మూర్తియాదవ్ కుమారుడు దుబాయ్‌లో ఉండడంతో ఆయన ఆందోళన చెందు తున్నారు. విశాఖకు చెందిన వందల మంది ఉ ద్యోగాలు, వ్యాపా రాల నిమిత్తం గల్ఫ్ దేశాల్లో నివస్తున్నారు.

ఇంటికే పరిమితమయ్యాం

ఖతార్‌లోని ఆల్కోర్‌లో ఉంటున్నాం. ఇక్కడ తెలుగు రాష్ట్రాల ప్రజలు సుమారు 30 వేల మంది ఉన్నారు. గత రాత్రి నుంచి ఆల్కోర్ చుట్టుపక్కల భారీ శబ్దాలు వినిపిస్తున్నాయి. 25 కిలో మీటర్ల దూరంలో ఉన్న బేస్ క్యాంపులపై దాడులు జరుగుతున్నా యంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇంట్లోనే ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో మినహా బయటకు రావద్దని సూచించింది. విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాస్‌లు ప్రారంభించారు. పది, ఇంటర్ సీబీఎస్‌సీ పరీక్షలను వాయిదా వేశారు. పెద్ద కంపెనీలు ఉద్యో గులకు వర్క్‌ఫ్రమ్ హోమ్ ఇచ్చాయి. తప్పుడు మెసేజ్‌లతో ఆందోళన చెందవద్దని, ప్రభుత్వ సూచనలను పాటించాలని భారత ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం నిత్యావసర సరుకులకు ఇబ్బంది లేదు. పెద్దషాపులు 24 గంటలు తెరిచి ఉంచేలా చర్యలు తీసుకున్నారు. గ్రూపుల్లో ప్రభుత్వ సూచనలను ఎప్పటికప్పుడు పోస్ట్ చేస్తున్నాం. భయాందోళన పరిస్థితులున్నప్పటికీ ప్రభుత్వ చర్యలతో కాస్త ఉపశమనం దక్కింది.

ఉసిరికల రాజా రమాపద్మజ, ఖతార్ తెలుగు అసోసియేషన్ అడ్వైజరీ సభ్యురాలు

ఇంటికి దగ్గరలోనే బాంబులు

దుబాయ్‌లో గత రాత్రి నుంచి దాడులు జరుగుతున్నాయి. ఇంటికి సమీపంలోనే బాంబులు పడుతుండడంతో భయాందోళన చెందుతున్నాం. విపరీతమైన శబ్దాలు, దుర్వాసన వెలువడుతోంది. ప్రస్తుతానికి విద్యుత్, నీరు, ఆహారానికి ఇబ్బందులు లేవు. ఫోన్ సిగ్నల్స్ ఉన్నాయి. కానీ, ఎప్పుడు ఏంజరుగుతుందో తెలియడం లేదు. ఎవరూ బయటకు రావద్దని ప్రభుత్వం సూచించింది. కొద్దిసేపటి క్రితం ఇంటికి సమీపంలోనే పెద్ద బాంబు పడిన శబ్దం వచ్చింది. బయటి నుంచి తెప్పించుకునే పార్సిల్స్‌కు బ్రేక్ పడింది.

– బి.జయసూర్య, సీనియర్ డిజైనర్ ఏ1 టైర్ కంపెనీ, దుబాయ్

యుద్ధ విమానాలతో ఆందోళన

ఇక్కడి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మేమున్న ప్రాంతానికి కొద్దిదూరంలో బాంబులు పడిన శబ్దాలు వినిపిస్తున్నాయి. ఎయిర్‌జెట్‌లు, యుద్ధవిమానాలు శరవేగంగా తిరుగుతున్నాయి. ప్రస్తుతం ఆహారానికి, విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు లేవు. బయటకు రావద్దని అధికారులు ఆదేశాలిచ్చారు. రూములకే పరిమితమయ్యాం. ఏం జరుగుతుందో తెలియడం లేదు. భారత ప్రభుత్వం ఇక్కడి అధికారులతో మాట్లాడిందని చెబుతున్నారు. సుమారు పది వేల మంది ప్రవాస భారతీయులమున్నాం.

## రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసే దిశగా భవిష్యత్ కార్యాచరణ









క్రైమ్ కౌంటర్ న్యూస్...రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసే దిశగా భవిష్యత్ కార్యాచరణ రూపకల్పన కోసం ఈరోజు కడప నగరంలో నిర్వహించిన అత్యంత కీలక సమావేశంలో పాల్గొనడం జరిగింది.

ఈ సమావేశంలో సజ్జల రామకృష్ణారెడ్డి , పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి , మరియు రాయలసీమకు చెందిన సీనియర్ వైసీపీ నాయకులతో కలిసి రాయలసీమ ప్రాంతానికి జలసిరి తీసుకురావాల్సిన అవసరంపై విస్తృతంగా చర్చించాం. రాయలసీమ ప్రజల దశాబ్దాల కల అయిన ఈ లిఫ్ట్ ప్రాజెక్టును పూర్తిచేసి, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నదే మా ప్రధాన లక్ష్యం. ప్రాజెక్టు పురోగతిని వేగవంతం చేయడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. రాయలసీమ అభివృద్ధే ధ్యేయంగా, ప్రజల ఆకాంక్షలను నిజం చేసే దిశగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుంది....

## బాణసంచా దుకాణాల్లో అధికారుల తనిఖీలు



క్రైం కౌంటర్ న్యూస్ : పెదపాడు, మార్చి 1 : కాకినాడ జిల్లాలో జరిగిన భారీ బాణసంచా పేలుడు, పలువురు మృత్యువాత చెందిన నేపథ్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పోలీసులు, రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బంది ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఏలూరు జిల్లాలో ఎస్పీ ప్రతాపశివ కిశోర్, నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ ఆదేశాల మేరకు పెదపాడు మండలం ఏపూరులో వున్న లక్ష్మీనారాయణ క్రాకర్స్ షాపుపై రెవెన్యూ, ఫైర్ సిబ్బంది ఆదివారం తనిఖీలను నిర్వహించారని పెదపాడు ఎస్ఐ ఆర్.శ్రీను తెలిపారు. దుకాణంలో వున్న నిల్వ, రికార్డులను పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా దుకాణంలో నిల్వ ఉంచిన సుమారు రూ.30 లక్షల విలువైన బాణసంచాను గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీను మాట్లాడుతూ బాణసంచా, పేలుడు పదార్థాల భద్రతలో నిర్లక్ష్యం వహిస్తే అది భారీ ప్రాణ, ఆస్తి నష్టానికి దారి తీస్తుందన్నారు. ప్రజా భద్రత కంటే వ్యాపార ముఖ్యం కాదని, నిబంధనలు అతిక్రమించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. షాపు నిర్వాహకులపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తనిఖీల్లో డిప్యూటీ తహసీల్దారు వీవీ రామారావు, అగ్నిమాపక అధికారి జి.నాగరాజు, వీఆర్వో నటరాజన్‌దాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భీమడోలు : భీమడోలు మండలంలోని పలు దుకాణాలను పోలీసులు, రెవెన్యూ, అగ్నిమాపక అధికారులు పరిశీలించి యజమా నులకు సూచనలు చేశారు. బాణసంచా తయారీ, అమ్మకాలలో నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ విల్సన్ హెచ్చరించారు. ఎస్ఐ మదీనాబాషా, ఆర్ఐ జగన్నా?థం తదిత రులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : పెనుగొండ మండలంలోని వెలగలేరులో శ్రీ విజయలక్ష్మి ఫైర్ వర్క్స్ , వాసవీ ట్రేడర్స్ , శ్రీలక్ష్మి ఫైర్ వర్క్స్ బాణసంచా దుకాణాలను పెనుగొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాయుడు విజయ్‌కుమార్ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయా షాపుల వారిని హెచ్చరించారు.

పాలకొల్లు అర్బన్ : పాలకొల్లు పట్టణ పరిధిలోని బాణసంచా తయారీ, విక్రయ కేంద్రాలను సీఐ కె.రజనీకుమార్ పర్యవేక్షణలో ఎస్ఐ జీజే ప్రసాద్ ఆదివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. భారీ బాణసంచా తయారీ కేంద్రాలు జనావాసాలకు దూరంగా ఉన్నాయా ? నిల్వ సామర్థ్యం అనుమతించిన మేరకు ఉందా? అధికంగా ఉందా? అత్యవసర సమయాల్లో వినియోగించేందుకు అగ్నిమాపక పరికరాలు ఉన్నాయా? అనే అంశాలు పరిశీలించారు. లైసెన్సు నిబంధనలు అతిక్రమించి అక్రమ బాణసంచా నిల్వ చేసే వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

# ప్రాణం తీసిన కరంటు తీగ

**విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి**
**మరొకరికి తీవ్ర గాయాలు**
**పశువుల షెడ్డు నిర్మాణంలో అపశ్రుతి**
**ఇసకలపాలెంలో విషాదం**
**కన్నీరుమున్నీరవుతున్న కుటుంబసభ్యులు**



మృతులు కంటుబోతు శ్రీను, కాళ్ల సూరీడు

క్రైం కౌంటర్ న్యూస్ : పద్మనాభం, మార్చి 1 కరంటు తీగ రెండు నిండు ప్రాణాలను బలిగొంది. పశువుల షెడ్డు నిర్మాణం సందర్భంగా ఏర్పాటు చేస్తున్న స్తంభాలు సమీపంలోని విద్యుత్ తీగలకు తగలడంతో ఇద్దరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద సంఘటన పద్మనాభం మండలం ఇసకలపాలెంలో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇసకలపాలెం గ్రామానికి చెందిన కాళ్ల సూరీడు, కుమారుడు కాళ్ల సూరిబాబుతో కలిసి పశువుల షెడ్డు నిర్మాణ పనులు చేయిస్తున్నారు. ఇందుకోసం కృష్ణాపురం కాలనీకి చెందిన కంటుబోతు శ్రీనును సహాయం తీసుకున్నారు. వీరు ముగ్గురు షెడ్డు నిర్మాణానికి స్తంభాలు వేస్తున్నారు. స్తంభం ఎత్తుతుండగా సమీపంలో ఉన్న విద్యుత్ తీగలను ఇనుప చువ్వలు తగలడంతో తీవ్ర విద్యుదాఘాతానికి గురయ్యారు. దీంతో కాళ్ల సూరీడు (65), కంటుబోతు శ్రీను(41) అక్కడికక్కడే మృతి చెందారు. సూరిబాబు (44) తీవ్ర గాయాల పాలవడంతో 108 వాహనంలో విజయనగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ విషాధ ఘటనతో రెండు కుటుంబాల వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కొద్దిసేపటి వరకు తమతో మాట్లాడిన వారు ఒక్కసారిగా తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఎస్ఐ బి.గణేష్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద కారణాలపై ఆరా తీశారు. పద్మనాభం సీఐ సీహెచ్ శ్రీధర్ కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కంటుభుక్త శ్రీనుకు భార్యతో పాటు కుమార్తె మాధురి, సాయిపవన్, వృద్ధాప్యంలోని తల్లిదండ్రులు ఉన్నారు. కుటుంబమంతి అతడి సంపాదనపైనే ఆధారపడింది. తాపీ మేస్త్రీగా పని చేస్తూ అందరితో కలివిడిగా ఉండి మృత్యువాత పడడంతో గ్రామంలో విషాదం నెలకొంది. కాగా శ్రీను స్వగ్రామం విజయనగరం జిల్లా డెంకాడ మండలం గుండాలపేట కాగా, జీవనాధారం కోసం వచ్చి ఇసకలపాలెంలో స్థిరపడ్డారు.

# నేడు చంద్రగ్రహణం

క్రైం కౌంటర్ న్యూస్ : ద్వారకాతిరుమల, మార్చి 1 శ్రీవిశ్వావసు నామ సంవత్సరంలో ఫాల్గుణ పౌర్ణమి రోజు మంగళవారం పాక్షిక కేతుగ్రస్త గ్రస్తోదయ చంద్రగహణం దేశవ్యాప్తంగా కన్పిస్తుందని పంచాంగకర్తలు చెబుతున్నారు. దీనివల్ల చంద్రుడు చీకటిగా ఉంటాడు. రంగుల పండుగ హోలీ రోజునే ఈ సుదీర్ఘమైన చంద్రగ్రహణం ఏర్పడనుండడంతో గ్రహణ ప్రభావం హోలీ వేడుకలపై ఉంటుందని జోతిష్య పండితులు హెచ్చరిస్తున్నారు. ఆలయాల మూసివేత, గ్రహణపట్టు, విడుపు స్నానాలు, గ్రహణ శాంతులు వంటివి ఆచరించాల్సి ఉందని చెబుతున్నారు. దేశంలో చంద్రుడు ఉదయించేటప్పుడు గ్రహణం విడుపు మాత్రమే కనబడుతుందని అందువల్లే దీనిని గ్రస్తోదయ చంద్రగ్రహణం అని పండితులు చెబుతున్నారు.

గ్రహణ సమయం మొత్తం 3.27 గంటలు అయితే దేశంలో సాయంత్రం 6.02 గంటలకు చంద్రోదయం అయిన తర్వాత 6.46 గంటల వరకు అంటే సుమారు 44 నిమిషాలు మాత్రమే కన్పిస్తుంది. గ్రహణ ప్రారంభ సమయం మార్చి 3న మధ్యాహ్నం 3.19 గంటలకు, మధ్యస్థ కాలం సాయంత్రం 5.03 గంటలకు, గ్రహణ మోక్ష కాలం సాయంత్రం 6.46 గంటలకు.సనాతన ధర్మాన్ని ఆచరించేవారు, గృహస్థ ఆశ్రమ నియమాలు పాటించే వారు మధ్యాహ్నం 12 గంటల లోపు భోజనాది కార్యక్రమాలు ముగించి గ్రహణ సమ యం పూర్తయ్యే వరకూ ఆహారం స్వీకరించ కుండా ఉండడం మంచిదని, ఈ గ్రహణం పుబ్బ నక్షత్రం సింహారాశిలో సంభవించడం వల్ల ఈ నక్షత్రజాతకులకు పూర్తిదోషం ఉంటుందని ఈ గ్రహణాన్ని చూడకూడదని, సింహ, కుంభ, కర్కాటక, మకర రాశి వారిపై చెడు ఫలితాలు ఇచ్చే విధంగా ఉంది. మిగిలిన రాశుల వారికి మధ్యస్థ, అనుకూల ఫలితాలు ఉ ంటాయని పండితులు సూచించారు.

ద్వారకాతిరుమల/జంగారెడ్డిగూడెం రూరల్/భీమవరం టౌన్ : ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉదయం 6.20 గంటల నుంచి మూసివేయనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆర్జిత సేవలు స్వామివారి దర్శనాన్ని రద్దు చేస్తున్నామని, ఆ మరుసటి రోజైన నాలుగో తేదీన అన్ని ఆర్జిత సేవలు, దర్శనాలు యథావిధిగా భక్తులకు లభిస్తాయని ఈవో భద్రాజీ తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి ఆలయం మంగళవారం ఉదయం 8 గంటలకు మూసివేసి మరుసటి రోజు ఉదయం సంప్రోక్షణ అనంతరం స్వామి దర్శనం ప్రారంభమవుతాయని ఈవో చందన తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పంచారామ క్షేత్రమైన గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయం ఉదయం 9 గంటలకు పూజలు పూర్తిచేసి ఆలయాన్ని మూసివేస్తామని, బుధవారం ఉదయం సంప్రోక్షణ నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తామని ఈవో రామకృష్ణంరాజు తెలిపారు.

# సమస్యల పరిష్కారంపై 'చలో విజయవాడ'కు పిలుపు

క్రైం కౌంటర్ న్యూస్ : పెదవేగి, మార్చి 1ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని అంగన్‌వాడీలు మహాధర్నాకు సిద్ధమయ్యారు. సోమవారం చలో విజయవాడకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు నిర్బంధిస్తారనే ఆలోచనలతో కొంతమంది అంగన్‌వాడీలు, సిబ్బంది ఆదివారం నుంచే విజయవాడకు బయలుదేరి వెళ్లారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సమస్యలు తీరతాయని ఆశించిన మాకు నిరాశే మిగిలిందని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో 42 రోజుల పాటు అలుపెరుగని పోరాటం చేస్తే జగన్ సర్కారు ఇచ్చిన హామీలను నమ్మి మోసపోయామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 19 నెలలైనా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఈ నేపథ్యంలో మరోసారి పోరాటానికి దిగాల్సిన పరిస్థితి వచ్చిందని, ఫిబ్రవరి 24 నుంచి 27 వరకు నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయిలో రిలే నిరాహార దీక్షకు దిగారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో సోమవారం చోలో విజయవాడను వేదికగా చేసుకున్నారు. అంగన్‌వాడీలు విజయవాడకు బయలుదేరుతుంటే ప్రభుత్వ అధికారులు వారిని అడ్డుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మొత్తం 3,851 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా ఆరేళ్లలోపు బాలలు ఒక లక్షా 68 వేల మంది అంగన్‌వాడీ సేవలు పొందుతున్నారు. గర్భిణులు 15,635 వేల మంది, బాలింతలు 16,836 మంది సేవలు అందుకుంటున్నారు.

అప్పటి.. ప్రతిపక్ష నేత హామీ ఏమైంది ?

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలను పరామర్శించిన అప్పటి ప్రతిపక్షనేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. మీ సమస్యల పరిష్కారం కోసం ఎక్కడా రాజీ పడకుండా ఆందోళన చేయండి.. మీకు మేము అండగా ఉంటాం అన్నారని, అధికారంలోకి వచ్చిన తరువాత సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఆ రోజున హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి దాదాపు 20 నెలలు గడచినా మా గోడును పట్టించుకోవడంలేదని అంగన్‌వాడీ యూనియన్ నేతలు అన్నారు.

ఏడేళ్లుగా ఒక్క రూపాయి పెరగలేదు

టి.మాణిక్యం, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఏలూరు జిల్లా కార్యదర్శి

మార్కెట్ ధరల పెరుగుదలకు అనుగుణంగా వేతనాలను పెంచాలి. దశలవారీగా



ఇప్పటివరకు పెరిగిన వేతనం నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే జరిగింది. ఏడేళ్ల కిందట కార్యకర్తలకు రూ.11,600, సహాయకురాలికి రూ.7వేలు చేశారు. అప్పటి నుంచి వేతనాలు పెరగలేదని, కనీసం కూటమి ప్రభుత్వంలోనైనా మరోసారి వేతనాలు పెంచాలి.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

డీఎన్వీడీ ప్రసాద్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు

అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న శ్రమ ఎనలేనిది. మహిళ గర్భందాల్చిన దగ్గరనుంచి వారి ఆరోగ్య సంరక్షణ చూస్తూ, ప్రసవం తరువాత బాలింతకు పోషకాహారంతోపాటు ఆరోగ్యానికి సంబం ధించిన సూచనలు, సలహాలు అందిస్తుం టారు. అనంతరం చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తారు. మరోవైపు పలు రకాల యాప్‌లతో అధిక శ్రమ చేస్తున్నారు. అటువంటి వారికి కనీస వేతనం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. కనీస వేతనం రూ.26లు వేలు ఇవ్వాలి.

హామీలు అమలు చేయాలి

పి.భారతి, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఏలూరు జిల్లా అధ్యక్షురాలు ఎన్నికలకు ముందు ప్రతిపక్షనేతగా సమ్మెకు మద్దతుగా నిలిచి, అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలు అమలు చేయాలి. అంగన్‌వాడీల సమస్యలన్నీ పరిష్కరించాలి. రకరకాల యాప్‌లతో పెరిగిన పనిభారాన్ని తగ్గించాలి. ఒక్క రూపాయి వేతనం పెంచకుండా చేయిస్తు్న వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించాలి.

# ఉపాధికోసం వెళ్లినవారిలో భయం..భయం..

## ఇక్కడ కుటుంబ సభ్యుల్లో ఆందోళన
## ఎప్పటికప్పుడు టీవీలు, ఫోన్లలో సమాచారం
## తెలుసుకుంటున్న కుటుంబీకులు



క్రైం కౌంటర్ న్యూస్ : గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ చేపట్టిన మిస్సైల్ దాడులతో అక్కడ ఉపాధి, ఉద్యోగాలు కోసం వెళ్లిన వివిధ ప్రాంతాల తెలుగు ప్రజలు బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. దుబాయ్, కతార్, అబుదాబీ, సౌదీ తదితర దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ మిసైల్ దాడులతో ఆయా దేశాలు భయం గుప్పెట్లో ఉన్నాయి. ఇప్పటికే గల్ఫ్ దేశాలు ప్రజల్ని బయటకు రావొద్దని, ఇళ్లలోనే ఉండాలంటూ ఆదేశాలు జారీ చేశాయి. ఏ..క్షణం ఏం జరుగుంతుందో అనే భయం నెలకొంది. ఈ సమాచారాన్ని ఎప్పటి కప్పుడు ప్రసార మాధ్యమాల్లో వింటున్న స్థానికుల్లో అందోళన నెలకొంది.

నరసాపురం/ తణుకు రూరల్, మార్చి 1 ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు, యువత ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లారు. ముఖ్యంగా దుబాయ్, కువైట్, మస్కట్, సౌదీ అరేబియా బహ్రెయిన్, ఇరాక్ వంటి దేశాలల్లో పనిచేస్తున్నారు. సుమారు 20 వేల నుంచి 25 వేల మంది వరకూ ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లారు. వీరిలో యువకులు కూడా ఉన్నారు. అత్యధికంగా నరసాపురం, పాలకొల్లు, ఆచంట, భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం, తణుకు ప్రాంతాల నుంచి ఎక్కువ మంది గల్ఫ్ దేశాలకు వెళ్లారు. ఇటీవల క్రిస్మస్, సంక్రాంతి పండుగలకు వచ్చి తిరిగి వెళ్లిన వారి సంఖ్య కూడా ఎక్కువే. హఠాత్తుగా యుద్ధం రావడంతో వీరి బం?ధువులు, కుటుంబ సభ్యులు ఒక్కసారిగా ఉలికిపాటుకు గురయ్యారు.గల్ఫ్‌లో వున్న తమ వారితో తరచూ ఫోన్‌లో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నారు. రెండు రోజుల నుంచి అయినవారికి ఫోన్‌లు చేస్తూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని అడిగి తెలుసుకుంటు న్నారు వీలు ఉంటే స్వదేశానికి వచ్చేయాలని సూచిస్తు యుద్ధాన్ని చూసి భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. మిసైల్ శబ్ధాలతో వణికి పోతున్నారు. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని ఆందోళనలో ఉన్నారు.

ఇళ్లలోనే ఉంటున్నాం : రామకృష్ణ, కతార్

నరసాపురం నుంచి ఉపాధి కోసం కతార్ వెళ్లాను. అమెరికా స్థావరాలపై క్షిపణుల దాడి జరుగుతుండటంతో రేయింబవళ్లు బాంబుల శబ్ధంతో బిక్కుబిక్కు మంటూ ఉన్నాం. ఇక్కడ ప్రభుత్వం ముందస్తుగా ప్రజల్ని అప్రమత్తం చేసింది. అందరికి సెలవులు ప్రకటించింది.ఇళ్లలోనే ఉండాలని ఆదేశించింది. దీంతో ఎవరూ బయటకు రావడం లేదు. సరుకులన్నీ తెచ్చుకుని రూమ్‌లోనే ఉంటున్నాం.

రాత్రి,పగలూ బాంబుల హోరు : జ్యోతి, సౌదీ

ఉద్యోగం నిమిత్తం మూడేళ్ల క్రితం నరసాపురం నుంచి సౌదీ వెళ్లా. ఇప్పటి వరకు ప్రశాంతంగా ఉంది. రెండు రోజుల నుంచి ఏం జరుగుతుందోనని భయం భయంగా ఉంది. స్వదేశానికి వద్దామన్నా ఎయిర్ పోర్టులన్నీ మూసివేశారు.గతంలో ఎప్పుడూ గల్ఫ్‌లో ఇలాంటి పరిస్థితి చూడ లేదు. రాత్రి, పగలు బాంబుల హోరు. ఇళ్లలోంచి బయటకు రావడం లేదు. భారత ప్రభుత్వం ఇండియన్ ఎయిర్‌లైన్స్ పంపితే చాలామంది స్వదేశానికి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు

తాగునీటికి ఇబ్బంది : కడజారి మంగ, కువైట్

తణుకు నుంచి ఉపాధి కోసం కువైట్ వెళ్లాను. హవాలీ నగరంలో బాంబుల మోతతో చాలా భయపడ్డాం. బాంబు దాడులు జరుగుతాయనే హెచ్చరికలతో సైరన్‌లు మోగాయి. దీంతో ప్రయాణాలు నిలిచి పోయాయి. శనివారం రాత్రి మంచినీరు కోసం చాలా ఇబ్బంది పడ్డాం. నిత్యా వసరాలు ముందుగానే స్టాకు పెట్టుకున్నాం.. మంచినీటిని కొనుగోలు చేయ లేదు. ఇక్కడ విమానాశ్రయం మూసి వేసినట్లు తెలిసింది.

ఆదివారం ప్రార్థనలను
నిలిపివేశారు : బైపా శ్రీకాంత్, దుబాయ్

ఉగ్యోగం కోసం తణుకు నుంచి దుబాయ్ వెళ్లాను. కరోమే నగరం బాంబుల మోతతో దద్దరిల్లి పోయింది. ఇవన్నీ ప్రధాన నగరానికి బయటే జరగడంతో ఇబ్బంది లేదు. ఆదివారం కూడా దాడులు జరుగుతాయని ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఆదివారం చర్చిల్లో ప్రార్థనల ఆపేయాలని ఆదేశాలు జారీ చేశారు.

మదుపుదారుల్లో భయాలు

నరసాపురం, మార్చి 1 స్టాక్ మార్కెట్ మదుపుదారుల్లో యుద్ధ భయాలు నెలకొన్నాయి. సోమవారం మార్కెట్‌పై ఏం ప్రభావం చూపుతుందోనన్న భయం ఇన్వెస్టర్లలో నెలకొంది. ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మార్కెట్‌లో తీవ్ర ఒడిదుడుకులు నెలకొన్నాయి. సుంకాలు, యుద్ధ భయాలతో గతేడాది నుంచి సూచీలు రెడ్‌లోనే ముగుస్తున్నాయి. దీంతో జిల్లా ఇన్వెస్టర్లు భారీ నష్టాలను మూటగట్టుకున్నారు. ఇప్పుడిప్పుడే పరిస్థితులు చక్కబడుతుండటంతో నష్టాల నుంచి బయటపడతామన్న ధీమాతో ఉన్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ యుద్ధం రావడంతో మార్కెట్‌పై ఏం ప్రభావం చూపుతుందోనని కలవరపడుతున్నారు. దీంతో సోమవారం మార్కెట్ కీలకంగా మారింది. యుద్ధం మరికొన్ని రోజులు కొనసాగితే ఆ ప్రభావం మార్కెట్‌పై పడుతుందని ఇప్పటికే ఆర్థికనిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో పెట్టిన పెట్టుబడులను ఉంచాలా ? లేక అయినకాడికి అమ్ముకోవాలా అనే మీమాంసలో పడ్డారు.

మళ్లీ వెండి, పసిడి ధరల పరుగు పసిడి, వెండి ధరలకు రెక్కలొస్తున్నాయి. ఈ యుద్ధంతో వీటి ధరలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయన్న ఊహాగానాలు బులి యన్ మార్కెట్‌లో షికారు చేస్తున్నాయి. ఇదే జరిగితే మళ్లీ బంగారం ధర పరుగులు తీసే అవకాశం ఉంది. వెండి కూడా అదే రూట్‌లో వెళ్లే ఛాన్స్ ఉందని బులియన్ వర్తకులు చెబుతున్నారు. దీంతో సోమవారం మార్కెట్ కీలకంగా మారింది. యుద్ధంతో చమురు దిగుమతులకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయన్న భయం వాహనదారుల్లో నెలకొంది.

# సినిమా



## ‘స్పిరిట్’లో డాన్ లీ ఉన్నాడా? లేడా?

ఒకవైపు సినిమా అప్డేట్స్ వస్తున్నా, మరోవైపు ఒక విదేశీ నటుడి గురించి సాగుతున్న ప్రచారం ఇప్పుడు చిత్ర బృందానికి తలనొప్పిగా మారింది. ఆయన ఒక గ్లోబల్ స్టార్.. బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట మొదలుపెడితే అది ఎక్కడ ఆగుతుందో ఎవరికీ తెలియదు. ఆయనతో ఒక సెన్సేషనల్ డైరెక్టర్ జతకడితే ఆ సినిమా రేంజ్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ‘స్పిరిట్’ మొదలైనప్పటి నుండి ఈ ప్రాజెక్ట్ చుట్టూ ఒక విదేశీ నటుడి పేరు విపరీతంగా వినిపిస్తోంది. కొరియన్ యాక్షన్ స్టార్ ఆ సినిమాలో ఉన్నాడని, ప్రభాస్ తో ఫైట్ చేయబోతున్నాడని లీకులు చక్కర్లు కొట్టాయి. అయితే తాజాగా విడుదలైన ఒక అప్డేట్ చూసిన తర్వాత అభిమానులు కొంత నిరాశకు లోనవుతున్నారు.వివేక్ ఒబేరాయ్ లుక్..

ఇటీవలే చిత్ర బృందం వివేక్ ఒబేరాయ్ లుక్ విడుదల చేసింది. సాధారణంగా ఇదొక క్రేజీ న్యూస్ అవ్వాలి, కానీ ప్రభాస్ అభిమానులు మాత్రం ‘జస్ట్ ఓకే’ అనేశారు. దీనికి ప్రధాన కారణం.. వారు ఆశించింది కొరియన్ నటుడు డాన్ లీని. గతంలో ‘యానిమల్’ కోసం బాబీ డియోల్ లాంటి సర్ప్రైజ్ విలన్ ని తీసుకొచ్చి షాక్ ఇచ్చిన సందీప్ వంగా, ఈసారి కూడా అలాంటి ప్రయోగమే చేస్తారని అందరూ భావించారు. వివేక్ మనకు కొత్త కాదు, ఇప్పటికే ‘రక్త చరిత్ర’, ‘వినయ విధేయ రామ’ సినిమాల్లో ఆయన విలనిజాన్ని చూసేశాం. అందుకే ఆయన ఎంట్రీ అంతగా సెన్సేషన్ కాలేకపోయింది.

సినిమా మొదలుకాక ముందు నుంచే డాన్ లీ ఈ ప్రాజెక్టులో ఉన్నాడనే వార్త విపరీతంగా ప్రచారంలో ఉంది. దీనిపై సందీప్ రెడ్డి వంగాను ఇంటర్వ్యూలలో అడిగినా ఆయన స్మార్ట్ గా తప్పించుకున్నాడు. ఒకవేళ డాన్ లీ లేకపోయినా అదేదో ముందుగా క్లారిటీ ఇస్తేనే సినిమాకు మంచిదని విశ్లేషకులు భావిస్తున్నారు. సోషల్ మీడియా అంతా ఒక విదేశీ నటుడి కోసం ఎదురుచూడటం వల్ల, సినిమాలోని ఇతర ముఖ్యాంశాలు మరుగునపడిపోయే ప్రమాదం ఉంది. ఈ పుకార్లకు త్వరగా చెక్ పెడితేనే ‘స్పిరిట్’ పక్కాగా హైలైట్ అవుతుంది.ప్రభాస్ బిజీ షెడ్యూల్..

మరోవైపు ప్రభాస్ ప్రస్తుతం ‘ఫౌజీ’ షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఆ తర్వాత ‘కల్కి 2’ సెట్స్‌లోకి అడుగు పెట్టాలి. సాధారణంగా ఒక సినిమా చేస్తున్నప్పుడు వేరే ప్రాజెక్టుల జోలికి వెళ్లకూడదని ప్రభాస్ భావిస్తారు, కానీ డెడ్ లైన్స్, బిజీ షెడ్యూల్స్ వల్ల ఆయన తప్పనిసరి పరిస్థితుల్లో పలు సినిమాలను బ్యాలెన్స్ చేయాల్సి వస్తోంది. ‘స్పిరిట్’ షూటింగ్ సమయానికి ఆయన పూర్తి డేట్స్ ఇవ్వగలుగుతారా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. సందీప్ రెడ్డి వంగా మార్కు యాక్షన్ కు ప్రభాస్ తోడైతే బాక్సాఫీస్ బద్ధలవ్వడం ఖాయం. కానీ అభిమానులు ఆశించినట్లుగా డాన్ లీ ఇందులో కనిపిస్తాడా లేక వివేక్ ఒబేరాయ్ తోనే సరిపెట్టుకోవాలా అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.





## కడుపు ఉబ్బరమా..? ఏసీడీటీనా..?

తరచుగా కడుపు ఉబ్బరం అనేది కేవలం అధికంగా తినడం లేదా అసిడిటీకి సంకేతంగా భావించి విస్మరిస్తారు. ఒక మాత్ర తీసుకుంటే సమస్య ముగుస్తుందని భావిస్తారు. కానీ మీరు దాదాపు ప్రతిరోజూ మీ కడుపులో బిగుతుగా అనిపిస్తే, సాయంత్రానికి కల్లా మీ బట్టలు బిగుతుగా అనిపిస్తే, లేదా కొన్ని ఆహార పదార్థాలు తీసుకోవడం తర్వాత మీరు కడుపు నిండినట్లు అనిపిస్తే, పరిస్థితి చాలా సులభం కావచ్చు. పేగులు తరచుగా నెమ్మదిగా సంకేతాలను పంపుతాయని అర్థం. తరచుగా ఉబ్బరంగా ఉండే ఏం చేయాలో తెలుసుకుందాం.

ఏసిడిటీ వల్ల గుండెల్లో మంట, పుల్లని త్రేనుపు లేదా పొత్తికడుపు పైభాగంలో మంట వస్తుంది. మరోవైపు, ఉబ్బరం అనేది పొత్తికడుపు ఒత్తిడి, బరువు లేదా ఉబ్బరం అనుభూతి ద్వారా వస్తుంది. రెండూ ఒకేసారి సంభవించవచ్చు, ఇది గందరగోళంగా ఉంటుంది. గ్యాస్, నెమ్మదిగా ప్రేగు కదలికలు, ఆహార అసహనం, హార్మోన్ల మార్పులు లేదా థైరాయిడ్ రుగ్మతలు కూడా అదనపు ఏసిడీటీ లేకుండా ఉబ్బరానికి కారణమవుతాయి. తరచుగా ఉబ్బరం రావడాన్ని తేలికగా తీసుకోకూడదంటున్నారు వైద్య నిపుణులు. ఇది ప్రకోప ప్రేగు సిండ్రోమ్, జీవక్రియ రుగ్మత, హార్మోన్ల అసమతుల్యతకు సంకేతం కావచ్చంటున్నారు.

పండుగలు, విందులు, శీతల పానీయాలు అతిగా తీసుకోవడం తర్వాత అప్పుడప్పుడు ఉబ్బరం రావడం సహజం. ఇది రోజువారీ అలవాటుగా మారినప్పుడు లేదా వారాల తరబడి కొనసాగినప్పుడు ఆందోళన కలిగించే అంశం. ముఖ్యంగా పట్టణ జీవన జీవనశైలి, ఒత్తిడి, తగ్గిన శారీరక శ్రమ కారణంగా క్రియాత్మక జీర్ణశయాంతర సమస్యలు పెరుగుతున్నాయి. ఇవి స్కాన్‌లలో కనిపించకపోవచ్చు, కానీ అవి ఇప్పటికీ జీవన నాణ్యతను ప్రభావితం చేస్తాయి. రోజువారీ ఉబ్బరం, భోజనం తర్వాత తీవ్రం కావడం, కడుపు నొప్పి, మలబద్ధకం లేదా విరేచనాలు, త్వరగా కడుపు నిండినట్లు అనిపించడం, అలసట, బరువు తగ్గడం లేదా జ్వరం వంటి కొన్ని లక్షణాలు ప్రత్యేక శ్రద్ధ అవసరమంటున్నారు డాక్టర్లు. మూడు నెలలకు పైగా కొనసాగే జీర్ణ లక్షణాలను స్వీయ చికిత్స కంటే వైద్యులను సంప్రదించడం ముఖ్యం. హార్మోన్లు, థైరాయిడ్ కూడా కీలక పాత్ర పోషిస్తాయి. తక్కువ థైరాయిడ్ స్థాయిలు ప్రేగు కదలికలను నెమ్మదిస్తాయి. హార్మోన్ల మార్పుల కారణంగా ఋతుస్రావం లేదా పెరిమెనోపాజ్ సమయంలో నీరు చేరుకోవడం, పెరిగిన వాయువు కారణం కావచ్చుంటున్నారు. ఒత్తిడి పేగు బాక్టీరియా, కదలికను కూడా ప్రభావితం చేస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

యాంటాసిడ్‌లు తక్షణ ఉపశమనాన్ని అందిస్తాయి, కానీ పదే పదే వాడటం వల్ల అంతర్లీన సమస్య కప్పివేయంటున్నారు. ఉబ్బరం రెండు నుండి మూడు వారాల కంటే ఎక్కువ కాలం కొనసాగితే.. ఆకలి, నిద్ర, రోజువారీ కార్యకలాపాలను ప్రభావితం చేస్తే, వైద్యుడిని సంప్రదించండి. సాధారణంగా థైరాయిడ్, రక్తహీనత పరీక్షలు, మల పరీక్షలు, అవసరమైతే ఇమేజింగ్ లేదా ఎండోస్కోపీతో సహా రక్త పరీక్షలతో ప్రారంభమవుతాయి. సమతుల్య ఆహారం, ఫైబర్, తగినంత నీరు, క్రమం తప్పకుండా వ్యాయామం, ఒత్తిడి నిర్వహణ తేలికపాటి కేసులలో సహాయపడతాయి. అయితే, శరీరం పదే పదే సంకేతాలను ప్రదర్శిస్తున్నప్పుడు, వాటిని విస్మరించకపోవడమే మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



## ఈ మొక్క కనిపిస్తే అస్సలు వదలొద్దు..!

మన ఇంటి చుట్టూ సాధారణంగా పెరిగే కుప్పింటాకు మొక్క, దీనిని ప్రాంతాన్ని బట్టి హరిత మంజరి లేదా మురిపిండి అని కూడా పిలుస్తారు. అపారమైన ఔషధ గుణాలు కలిగిన ఒక అద్భుత వనమూలిక. యూఫోర్బియేసి కుటుంబానికి చెందిన ఈ మొక్క శాస్త్రీయ నామం అకాలిఫా ఇండికా. ఆంగ్లంలో దీనిని ఇండియన్ అకాలిఫా, ఇండియన్ మెర్క్యూరి, ఇండియన్ కాఫర్ లీఫ్ లేదా ఇండియన్ నేటిల్ అని కూడా వ్యవహరిస్తారు. దీని ప్రత్యేకత కప్పాకారంలో ఉండే పుష్పగుచ్ఛం. ఈ మొక్కను పూర్వం నుంచి భారతీయ సంప్రదాయ వైద్యంలో, తమిళుల సిద్ధ వైద్యంలో ఉపయోగిస్తున్నారు. అంతేకాకుండా, పశ్చిమ తూర్పు ఆఫ్రికాలో కూడా ఇది ఒక గొప్ప ఔషధిగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆధునిక కాలంలో కూడా వైద్యులు దీనిని వాడమని సిఫార్సు చేయడం కుప్పింటాకు గొప్పతనాన్ని చాటుతుంది.

ప్రధాన ఆరోగ్య ప్రయోజనాలు:

కండరాల నొప్పులు: కుప్పింటాకు తాజా ఆకులను శుభ్రం చేసి రసం తీయాలి. ఈ రసానికి సమానంగా నువ్వుల నూనె కలిపి నీరు ఆవిరి అయ్యే వరకు సన్నటి మంటపై మరిగించి నిల్వ చేసుకోవాలి. కండరాల నొప్పి ఉన్నప్పుడు ఈ నూనెను గోరువెచ్చగా చేసి నొప్పి ఉన్న ప్రదేశంలో రాస్తే ఉపశమనం లభిస్తుంది.

తలనొప్పి: అధిక ఒత్తిడి లేదా ఇతర కారణాల వల్ల వచ్చే తలనొప్పికి, ఈ మొక్క రసాన్ని నుదిటికి రాసి కొంతసేపు విశ్రాంతి తీసుకుంటే తగ్గుతుంది.

చర్మ సౌందర్యం: పూర్వం నుంచి చర్మ సౌందర్యానికి ఈ మొక్కను ఉపయోగించేవారు. ఆకులను మెత్తగా పేస్ట్ చేసి పసుపు కలిపి ముఖానికి అప్లై చేసి పావుగంట తర్వాత చల్లటి నీటితో కడుక్కుంటే ముఖం తెల్లగా, కాంతివంతంగా మారుతుంది. ఇది మొటిమలు, నల్లటి మచ్చలను తగ్గించి, అవాంఛిత రోమాలను కూడా తొలగించడంలో సహాయపడుతుంది. జీర్ణ, శ్వాసకోశ సమస్యలు: విరోచనం సాఫీగా అవ్వడానికి, శ్వాసకోశ సమస్యలు, కఫం తగ్గించడానికి దీని తాజా ఆకులను రాత్రి గ్లాసు నీటిలో వేసి ఉదయం వడకట్టుకుని రెండు స్పూన్ల మోతాదుగా తాగాలి. అధికంగా తీసుకోకూడదు, వాంతులు అయ్యే అవకాశం ఉంది.

## చివర్లో బ్యాట్ ఝులిపించిన పోవెల్, హోల్డర్

టీ20 ప్రపంచకప్ 2026లో సెమీస్ చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచులో భారత్‌పై వెస్టిండీస్ భారీ స్కోరు చేసింది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఈ మ్యాచ్ జరుగుతుండగా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. ఓ దశలో తక్కువ స్కోరుకే పరిమితమయ్యేలా కనిపించిన వెస్టిండీస్.. చివర్లో పోవెల్, జేస్ హోల్డర్ బ్యాట్ ఝులిపించడంతో ఊహించిన దానికంటే ఎక్కువ రన్సే స్కోరు చేసింది. దీంతో భారత్ ముందు భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్.. వెస్టిండీస్‌కు బ్యాటింగ్ అప్పగించాడు. అయితే టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్‌కు ఓపెనర్లు మంచి ఆరంభం అందించారు. షై హోప్ (32), రోస్టన్ ఛేజ్ (36) తొలి వికెట్‌కు 68 పరుగులు జోడించారు. ఈ దశలో వరుణ్ చక్రవర్తి.. భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఇన్ ఫామ్ బ్యాటర్ షిమ్రాన్ హిట్‌మెయర్ క్రీజులో ఉన్నంత సేపు ధాటిగా బ్యాటింగ్ చేశాడు. 12 బంతుల్లో 27 రన్స్ చేసిన తర్వాత అతడిని జస్‌ప్రీత్ బుమ్రా ఔట్ చేశాడు.

బుమ్రా ఒకే ఓవర్‌లో హిట్‌మెయర్, రోస్టన్ ఛేజ్‌ను ఔట్ చేసి.. భారత్‌ను పోటీలోకి తెచ్చాడు. ఆ తర్వాత హార్దిక్ పాండ్యా కూడా వికెట్ తీయడంతో 15 ఓవర్లు ముగిసే సరికి వెస్టిండీస్.. 125/5తో నిలిచింది. దీంతో తక్కువ స్కోరుకే పరిమితమయ్యేలా కనిపించింది. కానీ ఆ తర్వాత వెస్టిండీస్ బ్యాటర్లు గేర్ మార్చారు. అర్షదీప్ వేసిన తర్వాతి ఓవర్లో ఏకంగా 24 పరుగులు రాబట్టారు. వరుణ్ వేసిన ఇన్నింగ్స్ 17వ ఓవర్‌లో 14 పరుగులు వచ్చాయి.

ఇక చివరకు వెస్టిండీస్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. రోవ్‌మన్ పావెల్ (34), జేసన్ హోల్డర్ (37) కలిసి ఐదో వికెట్‌కు 35 బంతుల్లో 76 పరుగులు జోడించారు. భారత బౌలర్లలో బుమ్రా రెండు వికెట్లు తీగా. హార్దిక్ పాండ్యా, వరుణ్ చక్రవర్తి ఒక్కో వికెట్ పడగొట్టారు.



## వెస్టిండీస్‌ను ఓడించలేకపోతే ఐపీఎల్ కాంట్రాక్టులు ఇవ్వొద్దు:

టీ20 వరల్డ్ కప్ 2026లో భారత్ ఆదివారం వెస్టిండీస్‌తో వర్చువల్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతోంది. ఇది సూపర్ 8 దశలో భాగమైనప్పటికీ, అసలు ప్రాధాన్యం మాత్రం సెమీఫైనల్ టికెట్‌పైనే నిలిచింది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు సెమీఫైనల్‌కు చేరుతుంది. ఓడిన జట్టు టోర్నీ నుంచి బయటపడుతుంది. ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లు ఆడిన ఇరు జట్లు రెండు పాయింట్లతో సమానంగా ఉన్నాయి. జింబాబ్వేపై భారీ విజయాలు సాధించినప్పటికీ, దక్షిణాఫ్రికాతో ఓటమి చవిచూశాయి.

మనోజ్ తివారీ సంచలన వ్యాఖ్యలు..

మాజీ భారత బ్యాటర్ మనోజ్ తివారీ సరదాగా కానీ కీలక వ్యాఖ్యలు చేశాడు. “భారత్ గత మ్యాచ్‌లో 256 పరుగులు చేసింది. ఆ స్థాయి నుంచి చూస్తే, వెస్టిండీస్‌పై ఎలాంటి ఒత్తిడి లేకుండా 200కి పైగా స్కోర్ చేసి సులభంగా గెలవాలి. వెస్టిండీస్‌ను ఓడించలేకపోతే, ఎవరికీ ఝూ కాంట్రాక్టులు ఇవ్వొద్దు” అని క్రిక్‌బజ్ చర్చలో తివారీ తెలిపాడు.

దక్షిణాఫ్రికాతో మొదటి సూపర్ 8 మ్యాచ్‌లో 76 పరుగుల తేడాతో ఓడిన భారత్, జింబాబ్వేపై 256/4 భారీ స్కోర్ చేసి 72 పరుగుల తేడాతో గెలిచి బలంగా తిరిగి వచ్చింది.

వీరేంద్ర సెహ్వాగ్ భిన్నాభిప్రాయం..

అదే చర్చలో పాల్గొన్న మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ మాత్రం తివారీ అభిప్రాయానికి భిన్నంగా స్పందించాడు. “మనం అజేయులం కాదు. ఇతర జట్లు కూడా గెలవడానికి వస్తాయి. దక్షిణాఫ్రికాతో ఓ చెడు రోజు ఎదురైంది. జింబాబ్వేను ఓడించాం. ఇప్పుడు వెస్టిండీస్‌ను ఓడిస్తే నవ్వుతూ సెమీఫైనల్‌కు చేరతాం” అని సెహ్వాగ్ చెప్పుకొచ్చాడు. “మన దేశం చాలా భావోద్వేగంగా స్పందిస్తుంది. ఒకే ఓటమి తర్వాత ప్రపంచకప్ పోయినట్లుగా స్పందిస్తారు” అంటూ పేర్కొన్నాడు.

సెమీఫైనల్ సమీకరణ..

దక్షిణాఫ్రికా చేతిలో ఓటమి భారత్‌కు కష్టాలు తెచ్చినా, దక్షిణాఫ్రికా వెస్టిండీస్‌పై గెలవడంతో పరిస్థితి కొంత సులభమైంది.

ఇంగ్లాండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా ఇప్పటికే సెమీఫైనల్‌కు అర్హత సాధించాయి. చివరి స్థానం కోసం భారత్, వెస్టిండీస్ పోటీ పడుతున్నాయి. ఈ హై వోల్టేజ్ మ్యాచ్‌లో గెలిచే జట్టే చివరి నాలుగులో స్థానం సంపాదిస్తుంది.

సెమీస్ పోరు ఇలా..

తొలి సెమీస్ లో భాగంగా న్యూజిలాండ్ వర్సెస్ సౌతాఫ్రికా జట్లు తపడనున్నాయి. ఇక రెండో మ్యాచ్ లో ఇంగ్లాండ్ జట్టుతో తలపడే జట్టు ఏదో మరికొద్దిసేపట్లో తేలనుంది.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H.No. 1-94, Nekunampuram, Pokur, Prakasam, Andhra Pradesh - 523113. Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2843. Ph:9849707349 email:kvp6858@gmail.com